ప్రజావాణిలో 11 వినతులు



వినతిపత్రాలు స్వీకరిస్తున్న అధికారులు

కీసర: నాగారం మున్సిపాలిటీలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజావాణిలో ప్రజలనుంచి వస్తున్న వివిధ ఆర్జీలను శాఖల వారీగా విభజించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్ అన్నారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి 11 ఆర్జీలను స్వీకరించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, టీపీఓ సెక్షన్ సిబ్బంది బాలమల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఈడీ లైట్లు అందజేయండి



వినతిపత్రం అందజేస్తున్న మున్సిపల్ చైర్మన్ తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీలో కొత్తగా ఏర్పడుతున్న కాలనీల్లో ఎల్ఈడీ స్ట్రీట్‌లైట్లు ఏర్పాటు చేసేందుకు సుమారు 3100 ఎల్ఈడీ లైట్లు అవసరమవుతాయని ఈఈఎస్ఎల్ ద్వారా వాటిని మున్సిపాలిటీకి అందజేయాలని కోరుతూ సోమవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్లచంద్రారెడ్డి, కమిషనర్ రాజేంద్రకుమార్ తదితరులు మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ నాగారం మున్సిపాలిటీలో కాలనీలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు.కొత్త కాలనీల్లో ప్రజల అవసరాలమేరకు మౌలికవసతుల కల్పన కోసం కృషి చేయనున్నట్లు తెలిపారు.

నూతన కార్యవర్గం ఏర్పాటు



నాగారం శ్రీనివాస్‌నగర్ ఫేస్-3 నూతన కమిటీ సభ్యులు

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని శ్రీనివాస్‌నగర్‌కాలనీ ఫేస్-3 నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పోసానిపల్లి మురళి, ఉపాధ్యక్షుడిగా సత్యనారాయణ, సుమంత్, జనరల్ సెక్రటరీగా మేకలరమేష్, ట్రెజరర్‌గా శ్రీనివాస్‌రెడ్డి, సంపత్, సభ్యులుగా పద్మావతి, అనితారెడ్డి, ప్రసాద్, పదనిశ్రీనివాస్, రాహుల్‌కుమార్, కోటేశ్వర్‌రావు, కిషోర్, రాజేష్, ఎల్లయ్య, శ్రీనివాస్, గోపి, యాదగిరి, మల్లిఖార్జున్, ముఖ్య సలహాదారులుగా అన్నంరాజు శ్రీనివాస్, రమణరావు తదితరులు ఎన్నికయ్యారు.

మొక్కల పెంపకంతోనే పర్యావరణ పరిరక్షణ



ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

మేడ్చల్: ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని కోరుతూ పట్టణంలోని లక్ష్మమ్మ స్మారక విద్యానిలయం, పీవీ హైస్కూల్ పాఠశాలల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. పాఠశాలల నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల మీదుగా వివేకానంద విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. చెట్లు నాటాలని, చెట్లను పరిరక్షించాలనే నినాదాలు చేశారు. పాఠశాల ఆవరణలో నిర్వహించిన వనమహోత్సవంలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారయణ, మాజీ ఎంపీటీసీ కుమార్‌యాదవ్, పాఠశాలలకు చెందిన సంతోష్‌గౌడ్, రామేశ్వర్‌రెడ్డి, నర్సింలుగౌడ్, ఆంజనేయులు, రాజెందర్‌రెడ్డి, మల్కగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కీసరగుట్ట స్వామి సేవలో జిల్లా జడ్జి



కీసరగుట్ట స్వామి సన్నిధిలో జిల్లాజడ్జి బాలభాస్కర్‌రావు

కీసర: కీసరగుట్ట శ్రీ రామలింగేశ్వరుడి సేవలో సోమవారం మల్కాజ్‌గిరి జిల్లా కోర్టు జడ్జి బాలభాస్కర్‌రావు కుటుంబ సమేతంగా పాల్గొన్నారు. ఉదయం దేవాలయానికి వచ్చిన ఆయనకు వేదపండితులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక పూజల అనంతరం వేదపండితులు ఆశీర్వచనంతోపాటు, మహాప్రసాదాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సుధాకర్ రెడ్డి, అర్చకులు, పండితులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

హాస్టళ్లు, కేఫ్‌లలో పోలీసుల తనిఖీలు



మైసమ్మగూడలో తనిఖీలు చేస్తున్న ఏసీపీ, పోలీసులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని పలు హాస్టళ్లు, కేఫ్, స్మోకింగ్ జోన్‌లలో సోమవారం పేట్ బషీరాబాద్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. పేట్ బషీరాబాద్ ఏసీపీ రాములు, సీఐ విజయవర్దన్, ఎస్ఐ ప్రవీణ్ లు నార్కోటిక్ డాగ్, సిబ్బందితో కలిసి డ్రగ్స్, గంజాయి ఆనవాళ్ల కోసం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ విద్యార్థులు, యువత డ్రగ్స్, గంజా, మద్యం వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలు తీసుకోవడం వల్ల జీవితాలు నాశనం అవుతాయన్నారు. మైసమ్మగూడ ప్రాంతంలో ఇంజినీరింగ్ కళాశాలలు అధికంగా ఉన్నందున మత్తు పదార్థాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నామని, అందులో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు.



మేడ్చల్ చెక్ పోస్ట్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



డబీల్‌పూర్‌లో..



గౌడవెళ్లిలో..

జన హృదయనేతకు
ఘన నివాళి

ఉమ్మడి రాష్ట్రానికి, కాంగ్రెస్ పార్టీకి దివంగత ముఖ్యమంత్రి మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ నాయకులు అన్నారు. మహనేత డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలు మున్సిపాలిటీలు, గ్రామాల్లోని వైఎస్ఆర్ విగ్రహాలకు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ రాష్ట్రానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. –మేడ్చల్ జోన్ బృందం



జ్ఞానాపూర్‌లో..



అంకుషాపూర్‌లో..



ఘనాపూర్‌లో..



దేవరయాంజాల్‌లో..



ఘట్‌కేసర్‌లో...



జవహర్‌నగర్‌లో వైఎస్ఆర్ జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మేయర్ శాంతి, డిప్యూటీ మేయర్ శ్రీనివాస్, అధ్యక్షులు శ్రీకాంత్‌యాదవ్



కండ్లకోయలో..

స్పెషల్ ఆఫీసర్ల పాలన షురూ ..!

అధికారుల నియామకం

- 15 మండలాల్లో అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణే లక్ష్యం
- వారానికి రెండు రోజులు స్థానిక సంస్థల్లో పర్యటనలు
- ప్రభుత్వ పథకాల అమలు, ఉద్యోగుల పని తీరు తదితర అంశాలపై నివేదికలు ఇవ్వాలని ఆదేశం



సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో అభివృద్ధి కార్యక్రమాలు,సంక్షేమ పథకాలను అర్హులైన ప్రజల దరికి చేర్చడంతో పాటు ప్రభుత్వ ప్రాధాన్యతలకు అనుగుణంగా ,వాటి అమలు తీరును మండలాల్లో పర్యవేక్షించేందుకు స్పెషల్ ఆఫీసర్లను నియమిస్తూ.. కలెక్టర్ గౌతమ్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. అభివృద్ధి పనులు , పథకాలను ప్రజల దరికి చేర్చేందుకు ఏలాంటి నిర్లక్ష్యం, అలసత్వాన్ని పాటించకుండా సంబంధిత ఉద్యోగుల పని తీరును మెరుగు పరిచే లక్ష్యంలో భాగంగా మండలాల్లో వారంలో ప్రతి మంగళ, శుక్రవారాల్లో స్పెషల్ ఆఫీసర్లు పర్యటించి..ఏమైనా ఫిర్యాదులు,అభివృద్ధి పనులు, పథకాల్లో నెలకొన్న లోపాలపై ఎప్పటికప్పుడు జిల్లా కలెక్టర్‌కు నివేదికలు అందజేయాల్సి ఉంటుంది. ఈ నివేదికల ఆధారంగా సంబంధిత శాఖల ఉద్యోగులపై చట్టపరమైన క్రమశిక్షణ చర్యలకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు తీసుకునే అవకాశం ఉంది.

స్పెషల్ ఆఫీసర్ల పర్యవేక్షణ ఇలా..

మండలాలకు నియమితులైన స్పెషల్ ఆఫీసర్లు ప్రతి మంగళ,శుక్ర వారాల్లో వారికి కేటాయించిన మండలాల పరిధిలో పర్యటించాల్సి ఉంటుంది. వీరు ప్రధానంగా అంగన్‌వాడీ కేంద్రాలు , గురుకులాలు, హాస్టళ్లు, ప్రభుత్వ విద్యాసంస్థలు, చిన్న పిల్లల హోమ్స్ , మొక్కల పెంపకం తదితర వాటితోపాటు ప్రభుత్వ ప్రాధాన్యతలకు సంబంధించిన విషయాలపై దృష్టి పెట్టాల్సి ఉంది. వారు పరిశీలించిన అభివృద్ధి పనులు ,సంక్షేమ పథకాల అమలు తీరులో కనిపించిన లోపాలు ,ఉద్యోగులు నిర్లక్ష్యం,అలసత్వం వంటి విషయాలతో పాటు ప్రగతి తదితర అంశాలను పరిశీలించి ..నివేదిక రూపంలో కలెక్టర్‌కు సమర్పించాల్సి ఉంటోంది. చర్యలు లేదా ప్రశంసలకు సంబంధించిన సిఫారసులను కూడా స్పెషల్ ఆఫీసర్ చేసేందుకు అవకాశముంది. దీనికి అనుగుణంగా కలెక్టర్ చర్యలకు ఉపక్రమించనున్నారు.

స్పెషల్ ఆఫీసర్లు వీరే..

మేడ్చల్-మల్కాజిగిరి జిలాల్లో 15 మండలాలు ఉండగా, మండలానికి ఒక జిల్లా స్థాయి అధికారిని స్పెషల్ ఆఫీసర్‌గా కలెక్టర్ గౌతమ్ నియమించారు. శామీర్‌పేట మండలానికి స్పెషల్ ఆఫీసర్‌గా జిల్లా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హోదాలో భూసేకరణ(ప్రరిశ్రమల శాఖ) అధికారి పి.సైదులును నియమించారు. మూడుచింతలపల్లి మండలానికి జెడ్పీ డిప్యూటీ సీఈఓ బి.నీరజ, కీసర మండలానికి జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణిమ, ఘట్కేసర్ మండలానికి డీఆర్‌డీఏ పీడీ సాంబశివరావు , మేడ్చల్ మండలానికి జడ్పీ సీఈఓ దిలీప్‌కుమార్, మేడిపల్లి మండలానికి బీసీ వెల్ఫేర్ జిల్లా అధికారి కేశురామ్, కాప్రా మండలానికి మహిళా ,శిశు ,వృద్ధుల సంక్షేమ శాఖ జిల్లా అధికారి కృష్ణారెడ్డిని స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు. మల్కాజిగిరి మండలానికి మల్కాజిగిరి ఆర్డీఓ శ్యామ్ ప్రకాష్, అల్వాల్ మండలానికి జిల్లా మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి కె.వీణ, గండిమైసమ్మ దుండిగల్ మండలానికి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ డి.బాలాజీ, కుత్బుల్లాపూర్ మండలానికి జిల్లా అడిట్ అధికారి కె.వెంకటేశం, బాచుపల్లి మండలానికి జిల్లా కోఆపరేటివ్ అధికారి కె.రాజేందర్‌రెడ్డి, బాలానగర్ మండలానికి ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి జి.వినోద్‌కుమార్, కూకట్‌పల్లి మండలానికి జిల్లా పరిశ్రమల శాఖ జీఎం పడాల రవీందర్, ఉప్పల్ మండలానికి ఏసీఎల్ ఎం.యాదయ్యను స్పెషల్ ఆఫీసర్‌గా నియమించారు.

దివ్యానగర్ ప్లాట్స్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా మల్లారెడ్డి



ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన అధ్యక్షుడు మల్లారెడ్డి, కార్యవర్గ సభ్యులు

ఘట్‌కేసర్: కాచవానిసింగారం దివ్యానగర్ ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా నల్ల మల్లారెడ్డి ఎన్నికయ్యారు. దివ్యానగర్‌లో సోమవారం నూతన కమిటీ ఎన్నికపై సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యానగర్‌లో డ్రైనేజీ, ఎలక్ట్రికల్ పనులు కోసం ప్లాట్ల యజమానులు చెల్లించాలని, కార్యాలయంలో అసిస్టెంట్, సెక్యూరిటీ, ఇతరులు ప్రవేశించకుండా రెండు గేట్లు ఏర్పాటు చేయాలని, దళారులు లోపలికి ప్రవేశించకుండా, ప్రజల స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని తీర్మానం చేశారు. నూతన అధ్యక్షుడిగా నల్లా మల్లారెడ్డి, ఉపాధ్యక్షుడిగా జమీల్, ప్రధాన కార్యదర్శిగా హైదర్, కార్యదర్శిగా సుదర్శన్, సంయుక్త కార్యదర్శిగా నిషాంత్‌రెడ్డి, కోశాధికారిగా సంపత్‌రెడ్డి, సభ్యులుగా భూమయ్య, సురేందర్, ఉషాకాంత్, వెంకట్‌రెడ్డి, రాజు, శ్రీరాం సూర్యనారాయణను ఎన్నుకున్నారు.

కీసరగుట్ట శ్రీరామలింగేశ్వరుడికి క్షీరాభిషేకం



స్వామివారికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న దృశ్యం



స్వామివారి పల్లకీసేవ

కీసర: కీసరగుట్ట శ్రీరామలింగేశ్వర స్వామికి సోమవారం వేదపండితులు క్షీరాభిషేకాన్ని కన్నులపండువగా నిర్వహించారు. ఉదయం గర్భాలయంలో కొలువైన శ్రీస్వామివారికి మహాన్యాసపూర్వక రుద్రాభిషేకం చేశారు. అనంతరం నిర్వహించిన క్షీరాభిషేక పూజలో ఆలయ చైర్మన్ తటాకం నాగలింగం పాల్గొన్నారు. స్వామివారి పల్లకీసేవలో భక్తులు పెద్ద సంఖ్యలోల పాల్గొన్నారు. కార్యక్రమంలో ఈఓ సుధాకర్‌రెడ్డి, పండితులు రవిశర్మ, బల్‌రాంశర్మ, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్‌లో త్వరలో బయోమెట్రిక్



ప్రజావాణి కార్యక్రమంలో వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి,సిటీబ్యూరో: కలెక్టరేట్ కార్యాలయంలో త్వరలో బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ గౌతమ్ తెలిపారు.ఇకపై జిల్లా అధికారులు,ఉద్యోగులు ,సిబ్బంది విధి నిర్వహణలో ఆఫీస్ వేళలు , సమయ పాలనను ఖచ్చితంగా పాటించాల్సి ఉంటుందన్నారు. తరచూ పర్యటనలకు వెళ్లే జిల్లా అధికారులు పలు జాగ్రత్తలు పాటించాల్సి ఉంటుందన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో ఆయన మట్లాడుతూ మండలాల పర్యటన సమాచారాన్ని తెలియజేయడం ద్వారా బయోమెట్రిక్‌ను వినియోగించాల్సి ఉంటుందన్నారు. మండలాలకు స్పెషల్ ఆఫీసర్లుగా నియమితులైన జిల్లా స్థాయి అధికారులు వారంలో రెండు రోజులు పర్యటించి, నివేదికలను అందజేయాల్సి ఉంటుందన్నారు. అంతకు ముందు ప్రజావాణిలో ప్రజల నుంచి కలెక్టర్ దరఖాస్తులను స్వీకించటంతోపాటు వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో124 దరఖాస్తులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో వనమహోత్సవం కింద నిర్దేశించిన లక్ష్యం ప్రకారం మొక్కలు నాటడానికి ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. రూరల్, గ్రామపంచాయతీలలో మొక్కలు సిద్ధంగా ఉన్నాయన్నారు. వర్షాలు కురుస్తున్నందున మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. జిల్లా కార్యాలయాల్లో పనిచేసే అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చర్మ ఆరోగ్యానికి ఆహారంలో మార్పుచేర్పులు

సాక్షి, సిటీబ్యూరో: చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచేందుకు ఆహారంలో మార్పు చేర్పులు అవసరమని ప్రముఖ కాస్మాటాలజిస్ట్ గీతికా మిట్టల్ గుప్తా అన్నారు. ప్రపంచ చర్మ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ తగినంత నిద్ర, చురుగ్గా ఉండటంతో పాటు సమతుల ఆహారంలో భాగంగా విటమిన్ ఇ, జింక్ తదితర పోషకాలు అందించే ఆల్మండ్స్(బాదం పప్పులు) వంటివి రోజువారీ ఆహారంలో చేర్చాలని సూచించారు. ఆహారంలో మార్పు చేర్పులు చేయకుండా పైపూతతో చర్మ సంరక్షణ అసాధ్యమని స్పష్టం చేశారు. సమావేశంలో న్యూట్రిషనిస్ట్ డా.రోహిణి పాటిల్ తదితర వైద్య నిపుణులు పాల్గొన్నారు.

విద్యాజ్యోతి పాఠశాలలో గ్రీన్ డే



బోడుప్పల్: చెంగిచర్లలోని విద్యాజ్యోతి ఉన్నత పాఠశాలలో సోమవారం గ్రీన్ డే వేడుకలను నిర్వహించారు. నేటి సమాజంలో పిల్లలు చేయకూడని, చేయాల్సిన పనులను నాటక రూపంలో ప్రదర్శించారు. వివిధ అంశాలపై ప్రసంగించారు. పాఠశాల డైరెక్టర్లు శ్రవణ్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై విచారణ చేపట్టాలి

కీసర: కీసర గ్రామంలో 2019నుండి 2024 జూలై వరకు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలపై పూర్తిస్థాయి విచారణ చేపట్టాలని కోరుతూ సోమవారం కీసర మాజీవార్డు సభ్యులు సింగోజి నర్సింహ్మాచారి జిల్లా కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఫిర్యాదు చేసారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కీసర గ్రామ పంచాయతీ పరిధిలో 2019 నుండి ఇప్పటి వరకు సర్వేనెంబర్196తో పాటు, వివిధ లేఔట్లలో కొందరు వ్యక్తులు పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా వందల సంఖ్యలో ఇళ్ల నిర్మాణాలు చేపట్టారన్నారు. పంచాయతీ అనుమతులకు సంబంధించి నకిలీస్టాంపులు, అనుమతిపత్రాలు, నకిలీ చలాన్ నంబర్లతో అనుమతులు తయారు చేసి అమాయకులైన వ్యక్తులకు ఇళ్లు విక్రయించి మోసం చేశారన్నారు. దీంతో పంచాయతీకి రావాల్సిన ఆదాయానికి గండి పడిందన్నారు. గత పంచాయతీ పాలకవర్గం అధికారులు, పాలకులు అక్రమ నిర్మాణాలను నిలుపుదల చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. ఇళ్ల నిర్మాణదారుల నుంచి అందినకాడికి దుండుకున్న పాలకవర్గం, గ్రామకార్యదర్శులు అక్రమ నిర్మాణాలను పొత్సహించారన్నారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కీసర గ్రామపంచాయతీ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై పూర్తిస్థాయిలో విచారణ చేపట్టి అక్రమాలకు పాల్పడిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుడికి జైలు

మేడ్చల్: కంపెనీకి వెళుతున్న వ్యక్తి పై దాడి చేసి హత్యకు యత్నించిన వ్యక్తికి మేడ్చల్ న్యాయస్థానం నాలుగేళ్ల జైలు శిక్ష రూ.1500 జరిమానా విధిస్తూ సోమవారం తీర్పు చెప్పింది. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కృష్ణమూర్తి కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సూరారం గ్రామానికి చెందిన శాలిం రాజు 2019 మే 20న డ్యూటీకి వెళుతుండగా వెంకట సుబ్బారావు అనే వ్యక్తి పాత కక్షల నేపథ్యంలో అతడిపై కత్తితో దాడి చేశాడు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన రాజు దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు వెంకటసుబ్బారావును అరెస్ట్ చేసి మేడ్చల్ అసిస్టెంట్ సెషన్స్ కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి నాలుగేళ్ల జైలు శిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి ఎం.అర్జున్ తీర్పు చెప్పారు.